# నిచ్చెన

ముసలయ్య అడుగుతున్నాడు 'ఏటే గవురీ - యియాల పయిసా అయినా రాలేదు''

గవురి మాట్లాడలేదు. ప్రొద్దుటి నుంచీ కడుపులో ఏమీ పడలేదేమో నీరసంగా వుండి అసలు మాట్లాడలేదు.

తన గుడ్డి కళ్ళకు అక్కడ గవురి వుందో లేదో అంతుపట్టని ముసలయ్య మళ్ళీ పిలిచాడు- ''గవురీ ఈడనె వున్నావా?'' అంటూ.

''ఊ!'' అన్నది గవురి తన చిరిగిపోయిన గౌను సర్దుకుంటూ.

''ప్రొద్దుటాలనించీ కూకుంటే పయిసా నేదియాల. ఈ ఎంకిటేసల్లకి మన మీద దయనేదు'' సణుగుతున్నాడు ముసలయ్య.

లోపల గుళ్ళో గంటలు, మంత్రోచ్ఛారణ వినపడుతున్నాయి.

జనం గోళ్ళోకి పోతున్నారు, వస్తున్నారు కానీ కొంచెం పక్కగా ఒక గుడ్డ నేల మీద పరచి ముష్టెత్తుతున్న ములసయ్యనూ, ఆరేళ్ల పిల్ల గవురినీ ఎవరూ పట్టించుకోవటంలేదు.

ఇద్దరు కాలేజి కుర్రవాళ్ళు వచ్చి ప్రక్కనే వున్న కొట్లో కొబ్బరికాయలు కొంటున్నారు.

"ఒరే ఆనంద్! ఈ ఒక్క సిగరెట్ అయిన తర్వాత గుళ్ళోకి వెడదాం!" అంటున్నాడు కళ్ళజోడు కుర్రవాడు.

"యా!" అన్నాడు ఆనంద్ అనబడే రెండో అతను.

"అన్నయ్యలూ.. ఒక పయిసా దరమం సేయండి బాబూ.. పొద్దుటాల్నించి ఏటీ తినలేదు!" నీరసంగా అడిగిండి గవురి.

కళ్ళజోడు కుర్రవాడు సిగరెట్‌ను గట్టిగా పీల్చి, ఆ పొగలోని ఆనందాన్ని తనివితీరా అనుభవిస్తూ, గవురి మాటలను వినిపించుకోలేదు.

"పద్మశ్రీ, నటజీవన సుబ్బారాయుడు నటించిన సినిమా 'పేదోళ్ళ బ్రతుకులు' కు బంగారు ఎలుక బహుమతి వచ్చింది తెలుసా" అడిగాడు ఆనంద్.

"అవును.. 'సినిమా భాగోతం' పుస్తకంలో చదివాను. సుబ్బారాయుడికి ఉత్తమ నటుడి బహుమతీ 'మహా అగ్రనటాగ్రేసర' బిరుదు కూడా యిస్తున్నారట"

"నేను ఆ సినిమా నాలుగోసారి చూసినప్పుడే అనుకున్నాను. సుబ్బారాయుడికి బహుమతి వస్తుందని. పేదవాడిగా బాగా నటించాడు. ముఖ్యంగా లాటరీలో మూడు లక్షల రూపాయలు వచ్చినప్పుడు మంచి ఫీలింగ్ లు యిచ్చాడు".

"పేదోళ్ళ బ్రతుకులు హిట్టవటంతో ఆ నిర్మాత యిప్పుడు 'బీదోళ్ళ బ్రతుకులు' సినిమా తీస్తున్నాట్ట. అందులో సుబ్బారాయుడుగారు బీదవాడుగా, ధనవంతుడిగా రెండు వేషాలు వేస్తున్నాట్ట...."

ఈ లోపల కళ్ళజోడు కుర్రవాడు సిగరెట్టు తాగటం అయిపోవటంతో, ఆ యిద్దరూ గుళ్ళోకి వెళ్ళిపోయారు.

"చూశావా అయ్యా... పేదోల్ల చినిమాలకు బగుమతులిత్తన్నారంట" అన్నది గవురి.

అదోలా నవ్వాడు ముసలయ్య.

ఈ లోపల ఏవో అరుపులు వివబడ్డాయి.

"పీడిత ప్రజల బ్రతుకులు".

"బాగుపడాలి"

"ప్రతిపక్ష పార్టీ"..

"వర్ధిల్లాలి"

"అధికార పార్టీ"

"నశించాలి"

చాలామంది పెద్దగా అరుస్తూ, ఊరేగింపుగా వెడుతున్నారు.

"అయ్యా.. యిన్నావా, ఆల్లు మన బతుకులు బాగుసేత్తారంట" అంది గవురి.

అదోలా నవ్వాడు ముసలయ్య.

ఈ లోపల నలుగురు ఆడవాళ్ళు గుళ్ళోంచి బయటకు వచ్చారు. గవురి కడుపులో

ఆకలంత పెద్ద జరీ బోర్డరు పట్టు చీరలు కట్టుకున్నారు.

అందులో పెదిమలకు లేత గులాబిరంగు రాసుకున్నావిడ, ఆ పెదిమలు అందంగా కదుపుతూ అంటున్నది.

"ఇది విన్నావా విజయా.. రచయిత్రి తాయారమ్మగారు వ్రాసిన నవల 'ఆకలి కడుపులు'కు సాహిత్య అకాడమీ బహుమతి వచ్చిందిట. ఈసారితో ఆవిడకు పేరుకి పేరూ, డబ్బుకి డబ్బూ... పుష్కలంగా....."

కనుబొమ్మలు సన్నగా గీసుకుని దిద్దుకున్న విజయ అంటున్నది.

"నేను చదివాను ఆ పుస్తకం. బాగా రాసిందావిడ ముఖ్యంగా ఆ పేద పిల్ల వాసంతిని, రథంలాటి కారులో వచ్చిన రాజశేఖరం ప్రేమించి పెళ్ళాడి, కాశ్మీరుకు తీసుకుపోవటం బాగా రాసిందావిడ".

"అవునవును" అన్నది జారవిడిచి పమిటను ఒకసారి క్రిందకు జార్చి సరిచేసుకున్న ఎర్రబుగ్గల సన్నటి అమ్మాయి.

"హైద్రాబాద్ సముద్రపు ఒడ్డు మీద అడుక్కునే ఆ పిల్ల కాశ్మీర్ డాల్ సరస్సులో ప్రేమవిహారం చేయటం నాకు బాగా నచ్చింది!" ఇలాంటి నవలలు చాలా వస్తేకాని పేదవాళ్ళ జీవితాలు బాగుపడవు" బొడ్డు క్రిందకు కట్టిన చీరను యింకొంచెం క్రిందకు నెడుతూ అన్నదా నాలుగో అమ్మాయి.

ఇంకా ఆ నవల్లోని గుణగణాల్ని మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు, ఆ నలుగురు మెరుపుతీగలూ.

"విన్నావా అయ్యా..." గవురి ఏదో అనబోతుంటే చేయి పైకెత్తాడు ఆగమని ముసలయ్య.

విచిత్రంగా చూసింది గవురి.

అదోలా నవ్వాడు ముసలయ్య.

"అయ్యా.. ఆకలేతా వుంది" అన్నది గవురి.

ముసలయ్య ఆ ఆరేళ్ళ పిల్ల చింపిరి తల మీద చేయి వేసి ప్రేమగా నిమిరాడు.

"చీకటి పడతా వుంది. సూద్దారి యింకాసేపట్లో ఏ దరమరాజో పెచలి త్తాడేమో" అన్నాడు.

ఈలోగా ఏవో అరుపులు వినపడ్డాయి.

"పీడిత ప్రజల బ్రతుకులు"...

"బాగుపడాలి"

"హరిజన గిరిజనుల జీవితాలు"...

"బాగు చేయాలి"

"అధికార పార్టీ"

"వర్ధిల్లాలి"

"ప్రతిపక్ష పార్టీ"

"నశించాలి"

చాలామంది పెద్దగా అరుస్తూ ఊరేగింపుగా వెడుతున్నారు.

"అయ్యా.. ఈల్లూ, యిందాకటోల్లూ ఒకలేనా?" అడిగింది గవురి.

"కాదు.. ఏరు ఏరు పారిటీవోల్లు"

"ఆల్లు మన బతుకులు బాగుసేత్తారంట" అన్నది గవురి.

అదోలా నవ్వాడు ముసలయ్య

ఇంతలో అక్కడికో కారు వచ్చి ఆగింది.

ఒక ల్లావాటి సిల్కు లాల్చీ ఆయనా, ఆయన వెనక తలలో బోలెడు మల్లెపూల ఆవిడా దిగారు.

'రేపు మహిళా సమాజంలో 'పేద జనోద్ధరణ మహిళల కర్తవ్యం' అనే విషయం మీద నా వుపన్యాసం వుంది... మీరు కూడా రావాలి" అంటున్నది త.బో.మ ఆవిడ.

లా.సి.లా ఆయన నవ్వాడు. "నాకెలా కుదురుతుంది వెంకటలక్ష్మీ - సరిగ్గా అదే సమయానికి మాలపల్లిలో గ్రంథాలయం ప్రారంభోత్సవం చేయాలి కదా ...."

ఇద్దరూ ముసలయ్యనూ, గవురినీ కనీసం చూడనన్నా చూడకుండా గుళ్ళోకి వెళ్లిపోయారు.

"మన మాలపల్లిలో గ్రంథాలయం పెడతారంట. నాకు తెలవక అడుగుతాను గ్రంథాలయం అంటే ఏటయ్యా -" అన్నది గవురి.

"నాకూ తెల్దే. లే పోదారి. యింకో చెంటర్లో పయిచలొత్తాఏమొ సూద్దారి" అంటూ లేచాడు ముసలయ్య.

గవురి కూడా లేచింది. క్రింద పరచిన ఖాళీ గుడ్డని తీసుకుని భుజాన వేసుకుంది.

గవురి, గవురి భుజం పట్టుకుని ముసలయ్యా నడవసాగారు.

గుడిలో లోపల నుంచి పురాణ కాలక్షేపం వినపడుతున్నది.

శాస్త్రిగారు అంటున్నారు - "మానవసేవే మాధవసేవ అండీ. మానవులను, ముఖ్యంగా ఏమి ఆధారంలేని ప్రజలకు సేవ చేస్తే, దేవుడిని కూడా పూజించినట్టు అన్నమాట. అప్పుడే దేవుడు కూడా సంతోషిస్తాడు...."

"అయ్యా - అందరూ పేద పెజలను బాగుసేయాలి అంటారు గందా- మరి మనకి పొద్దుటాల నించి గుప్పెడు మెతుకులు కూడా దొరకనేదె...." అమాయకంగా అడిగింది గవురి.

పేదోడి బ్రతుకులు బాగుచేయాలి అంటూ పేదవాడి పేరు మీద డబ్బు సంపాదించి, తమ బ్రతుకుల్ని బాగుచేసుకునే ఈ లోకం గురించి గవురికి ఎలా అర్థమయేలా చెప్పాలో అర్థం కాక వూరుకున్నాడు ముసలయ్య.

"ఏమయ్యా - మాటాడవ్?" అన్నది గవురి, ఆకలి కడుపుని చేత్తో నిమురుకుంటూ.

అదోలా నవ్వాడు ముసలయ్య.

అతని కడుపులోనూ బాగా 'ఆకలి'గా వుంది.

*